

బస్సు కోసం ఎదురుచూస్తున్న యువతులు, మహిళలు

బస్సుల కోసం తప్పని ఎదురుచూపులు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ టూ హైటెక్ సిటీ మార్గంలో బస్సుల కోసం యువతులు, మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు. కూకట్‌పల్లి, మియాపూర్, జీడిమెట్ల డిపోల నుంచి జేఎన్‌టీయూ చౌరస్తా నుంచి హైటెక్‌సిటీ వైపు బస్సులు నడుపుతున్నారు. కానీ సమయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో మహిళలు గంటల కొద్దీ బస్టాపుల్లో నిలబడి ఎదురుచూస్తున్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సర్వీసులు పెంచకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని వాపోతున్నారు. మియాపూర్, బాచుపల్లి, గాజులరామారం నుంచి కాకుండా జేఎన్‌టీయూ చౌరస్తా నుంచి హైటెక్‌సిటీ మార్గం వైపు సర్వీసులు పెంచితే బాగుంటుందని మహిళా ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

మాజీ కార్పొరేటర్‌పై కేసు నమోదు

కార్వాన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారు ప్రకాష్, అతని అనుచరులపై ఆసిఫ్‌నగర్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం మధ్యాహ్నం బీజేపీ పార్టీలో చేరేందుకు బంగారు ప్రకాశ్ తన అనుచరులతో కలసి గుడిమల్కాపూర్ నుంచి ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీకి అనుమతి లేకపోవడంతో ఎన్నికల అధికారి గాంధీ ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రకాష్‌తోపాటు పలువురిపై ఆసిఫ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పార్కింగ్ స్థలం విషయంలో గొడవ

● కత్తితో దాడిచేసిన ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బార్ అండ్ రెస్టారెంట్‌లో పార్కింగ్ స్థల విషయంలో గొడవ పడిన ఘటనలో కత్తితో దాడిచేసిన ఇద్దరు పాత నేరస్థులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బార్కస్ ప్రాంతానికి చెందిన షేక్ సాజిద్ (28) పాత నేరస్థుడు. ఇతడిపై 9 కేసులున్నాయి. బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. భవానీనగర్‌కు చెందిన షేక్ అమీర్ అలియాస్ అమ్ము అలియాస్ ఏటీఎం(37) ఆటోడ్రైవర్. ఇతడు కూడా 3 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వారిద్దరూ ఈనెల 9వ తేదీన నాగులచింత క్రాస్‌రోడ్స్‌లో ఉన్న వైన్ బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అదే సమయంలో బార్ నుంచి మద్యం తాగి పార్కింగ్‌లోకి పవన్ అనే వ్యక్తి వచ్చాడు. వీరిద్దరికి.. పవన్‌కు మధ్య చిన్న విషయంలో గొడవ జరిగింది. గొడవ పెరిగి పెద్దది కావడంతో సాజిద్, అమీర్ ఇద్దరు బ్లేడు లాంటి చాకుతో పవన్‌పై దాడిచేశారు. దాడిలో పవన్ గొంతు, చెవికి గాయాలయ్యాయి. గమనించిన వైన్ బార్ ఉద్యోగి శ్రీనివాస్ వీరిని వారించే ప్రయత్నం చేయగా, సాజిద్, అమీర్ అతడిపై దాడి చేశారు. శ్రీనివాస్ ముఖంపై గాయమైంది. అనంతరం వీరిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో దీనిపై కేసునమోదయింది. శుక్రవారం సాజిద్, అమీర్‌లను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని, మొఘల్‌పురా పోలీసులకు అప్పగించారు.



విశ్వేశ్వర్‌రెడ్డిపై పూలుచల్లి ఆశీర్వదిస్తున్న గిరిజన మహిళలు

కేంద్రం నిధులిచ్చినా..
అప్పటి సీఎం పక్కదారి పట్టించారు

శంషాబాద్‌రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ భారీగా నిధులు ఇచ్చినా, అప్పటి ప్రభుత్వం ఆ నిధులను దారిమళ్లించి రాష్ట్ర ప్రగతిని కుంటుపరిచిందని పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్‌పై బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిపులు చెరిగారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని బురుజుగడ్డతండా, చిన్నగోల్కొండ, శంకరాపూర్, కొత్తగూడ, పెద్దగోల్కొండ, ముచ్చింతల, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ, షాపూర్ తండా, సంఘీగూడ, మదనపల్లి గ్రామాలలో ప్రజాఆశీర్వాదసభల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. మరోమారు నరేంద్రమోదీని ప్రధానమంత్రిగా చేసి దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. మోదీ చేస్తున్న కృషిని విదేశాల అధికారులు, రాజకీయ నాయకులు ప్రశంసిస్తున్నారని విశ్వేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్ర ప్రగతికోసం ప్రధాని మోదీ కోట్లాది నిధులు ఇస్తే ఆనాటి రాష్ట్ర సీఎం కేసీఆర్ కేంద్ర నిధులను ఇతర శాఖలకు మళ్లించారని ఆరోపించారు. మారుమూల గ్రామాల్లో వైకుంఠధామాలు, రైతు వేదికలు, రోడ్లకు వాడిన నిధులు కేంద్ర ప్రభుత్వ నిధులేనని చెప్పారు. బీఆర్ఎస్ నాయకుల లిక్కర్ దందా, ఫోన్ల ట్యాపింగ్‌తో వేగసతమతమవుతున్నారని అన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు తోకల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, మాజీ సర్పంచ్ సుజాత, కంద శ్రీను, ప్రశాంత్, లక్ష్మయ్య, గండురాజు తదితరులున్నారు.

కుషాయిగూడలో చైన్‌స్నాచర్ అరెస్ట్

● రూ.ఐదున్నర లక్షల విలువైన మూడు బంగారు గొలుసులు, ద్విచక్రవాహనం స్వాధీనం

ఏఎస్‌రావునగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ చైన్‌స్నాచర్‌ను శుక్రవారం కుషాయిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి రూ.5.58లక్షల విలువైన 6.7తులాల మూడు బంగారు గొలుసులను, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుషాయిగూడ ఏసీపీ మహేష్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా హన్మకొండ ఇందిరానగర్‌కు చెందిన పుట్టా హరికృష్ణ(38) జీవనోపాధి కోసం భార్యా, పిల్లలతో నగరానికి వలస వచ్చి మేడిపల్లి మండలం చెంగిచర్లలోని ఓ ప్రైవేటు స్కూల్ ఆవరణలో నివాసం ఉంటున్నాడు. కారు డ్రైవర్‌గా పనిచేసే హరికృష్ణ చెడు అలవాట్లకు బానిసై, కుటుంబ పోషణ భారమై సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశ్యంతో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఈ నెలలో 3, 7, 8 తేదీలలో కుషాయిగూడ, కీసర, సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని వివిధ ప్రాంతాలలో రోడ్లపై నడుచుకుంటూ వెళ్తున్న ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కెళ్లాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి చెంగిచర్లలోని అతడి ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. కేసును ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఏసీపీ మహేష్ ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జి.వీరస్వామి, బి.రాజు నాయక్ పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దైవచింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల గ్రామంలోని వేంకటేశ్వర శివవీరాంజనేయ స్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, అడ్వకేట్ కమలాకర్, ఆలయ కమిటీ సభ్యులు జయరాంరెడ్డి, కృష్ణారావు, రాఘవేందర్‌రావు, బీరప్ప, శ్రావణ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, దేవేందర్, కాలే నాగేష్, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

పోటాపోటీగా ఎంపీ అభ్యర్థుల ప్రచారం

ప్రజలను మోసం చేస్తోన్న తెలంగాణ ప్రభుత్వం: ఈటల

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఉచిత హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కొంపెల్లి మున్సిపల్‌లోని బొబ్బిలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 17 ఎంపీ సీట్లు గెలిస్తే ఆరు గ్యారెంటీలు నెరవేరుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కల్యాణలక్ష్మి పథకం అమలు కావడం లేదన్నారు. ఎకరానికి 15 వేల రూపాయలు రైతుబంధు ఇస్తామని చెప్పి కనీసం 10 వేల రూపాయలు కూడా ఇవ్వడం లేదన్నారు. బీజేపీకి ఓట్లేస్తే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. బీజేపీకి ఓట్లు వేసి ఈటలను గెలిపించాలని కోరారు.

● మోదీ మూడోసారి ప్రధాని కావాలి

ఓల్డుబోయినపల్లి: అరుణాచల్‌ప్రదేశ్ నుంచి కేరళ వరకూ ప్రతీ భారతీయుడు మోదీ మూడోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్నాడని ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం రాత్రి ఓల్డుబోయినపల్లి జీఎస్టీ కార్యాలయం నుంచి హస్మత్‌పేట్ దుబై గేట్ వరకూ చేపట్టిన రోడ్‌షోలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు. ప్రచారరథం పైనుంచి ఈటల రాజేందర్ అభివాదం చేస్తూ మాట్లాడారు. భారత్ ప్రపంచానికి విశ్వగురువు అయిందంటే దానికి మోదీనే కారణమన్నారు. ప్రజలు బీజేపీని గెలిపించి మూడోసారి మోదీని ప్రధానిని చేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

● సునీతామహేందర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరు

బాలానగర్: మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని, ఎన్నిశక్తులు అడ్డుపడినా గెలిపించి తీరుతామని కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బాలానగర్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి ప్రచార వాహనాలను పార్టీ నాయకులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, గాలి బాలాజీ, సాదు ప్రతాప్‌రెడ్డి, మేకల మైఖేల్, సంజీవరావు, గంధం రాజు, అస్లాం, రజిత పాల్గొన్నారు.



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న బండి రమేష్

హఫీజ్‌పేటలో కాంగ్రెస్ ప్రచారం

మియాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో అందరూ లబ్ధి పొందుతున్నారని శేరిలింగంపల్లి నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి, కుటుంబసభ్యులతో కలిసి టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, కార్పొరేటర్ పూజితతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని తెలిపారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి కుటుంబసభ్యులు

చేవెళ్లగడ్డపై బీజేపీ జెండాను ఎగురవేస్తాం

హైదర్‌నగర్: ఈ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఫేజ్-2, జలకన్య హోటల్, లాస్ట్ బస్టాప్, ఎల్లమ్మబండ చౌరస్తాలో ప్రధానిమోదీ చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. బీజేపీకి ఓట్లు వేసి విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొండా విశ్వేశ్వరరెడ్డి సోదరి అనితారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రాఘవేందర్‌రావు, రవీందర్‌రావు, నర్సింగ్‌యాదవ్, నరసింహాచారి, కమలాకర్‌రెడ్డి, రామరాజు, మణిభూషణ్, వెంకటస్వామి, రాయల్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న రవికుమార్‌యాదవ్, అనితారెడ్డి

చిన్నారిపై వీధికుక్క దాడి

కాసేపటికి మరో మహిళపై కూడా..

దుండిగల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ గ్రామంలో శుక్రవారం ఓ వీధి కుక్క, నాలుగేళ్ల చిన్నారిపై, ఆ తర్వాత మరో మహిళలపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి అనన్యపై వీధి కుక్క దాడిచేయడంతో తలపై, ఒంటిపై తీవ్రగాయాలయ్యాయి. కాసేపటికి మరో మహిళపై కూడా దాడిచేయడంతో ఆమెకు సైతం గాయాలయ్యాయి. ఇద్దరిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

● బ్లూ క్రాస్ అనుమతితో కుక్కల పట్టివేత

దుండిగల్ కొరివి బస్తీలో ఓ వీధికుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపర్చాయని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ వెంటనే స్పందించారు. బ్లూక్రాస్ సొసైటీ వారిని సంప్రదించి యానిమల్ కంట్రోల్ బర్డ్‌వ్యాన్ (డాగ్స్‌క్యాచ్ వ్యాన్)పిలిపించి అన్ని వీధులలో కుక్కలను పట్టించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వారిని పరామర్శించారు. మున్సిపల్ పరిధిలో కుక్కల సమస్య ఉంటే (99487 95556, 90300 95839, 95427 15377)కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.



చిన్నారిని పరామర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, గాయపడిన చిన్నారి

రైళ్లు ఢీకొని ఇద్దరి మృతి

చందానగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొన్ని ఓ మహిళ, మరో వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన లింగంపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి మండలం చందానగర్ డివిజన్ శాంతినగర్‌లో నివాసం ఉండే రంగమ్మ(57) కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తుంది. బుధవారం మధ్యాహ్నం పాపిరెడ్డి కాలనీలో వారంతాపు సంతలో కూరగాయలు అమ్మడానికి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ దాటుతుండగా బేగంపేట నుంచి వికారాబాద్ వెళ్లే రైలు ఢీకొంది. దీంతో ఆమె గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● మరో ఘటనలో..

లింగంపల్లి, చందానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి(46)ని బేగంపేటకు వెళ్లే రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. సంఘటన స్థలానికి సీఆర్‌పీ పోలీసులు చేరుకుని మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు.



మల్లారెడ్డి, పద్మయ్యను సత్కరిస్తున్న రాజేశ్వర్‌రావు

బీజేపీ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కన్వీనర్‌గా మల్లారెడ్డి

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కన్వీనర్‌గా సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, కో కన్వీనర్లుగా పద్మయ్య, ప్రసన్నకుమారిలు శుక్రవారం నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన ముగ్గురిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేటలోని జిల్లా కార్యాలయంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, ప్రీతంరెడ్డి, పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేయడం, సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీ శ్రేణులను ఏకీకృతం చేసేందుకు ఈ నియామకాలు చేపట్టినట్టు తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ కాంగ్రెస్ యువ నాయకుడు కట్టా శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నియోజకర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, టూరిజంశాఖ చైర్మన్ పటేల్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలమైన శక్తిగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా చైర్మన్ మన్నే సతీష్, నాయకులు రఘునందన్‌రెడ్డి, భానుప్రసాద్, నల్ల సంజీవరెడ్డి, కృష్ణ ముదిరాజ్, మహిపాల్‌యాదవ్, సునీతారెడ్డి, మన్నేపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐలో చేరిన సాయిపంతులు

దుండిగల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి సాయికుమార్ పంతులు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సమక్షంలో కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఎన్ఎస్‌యూఐలో శుక్రవారం చేరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లిలో మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశంలో ఆయన ఎన్ఎస్‌యూఐలో చేరారు. ఈ కార్యక్రమంలో జాన్, పృథ్వీ, రాకేష్, రాహుల్‌యాదవ్, వినయ్, అరుణ్ పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం మెట్ల వద్ద తప్పిపోయి తిరుగుతున్న చిన్నారిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. చిన్నారిని గుర్తించిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

- జీడిమెట్ల, ఆంధ్రజ్యోతి

భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ

బర్కత్ పుర ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటిని భర్త పట్టించుకోకపోవడంతో గొడవపడి తన ఇద్దరు పిల్లలను వదిలేసి భార్య వెళ్లిపోయిన సంఘటన కాచిగూడ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ కుమార్ వివరాల ప్రకారం.. సంజీవయ్యనగర్‌లో నివాసముంటున్న శంకర్‌తో 2017లో భూమా రేణుక(26)కు వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. భర్త ఇంటిని పట్టించుకోకపోవడంతో భార్యాభర్తల నడుమ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం కూడా గొడవ జరిగింది. దీంతో తీవ్రమనస్తాపం చెందిన రేణుక ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో రేణుక తల్లి తిరుపమ్మ కాచిగూడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మద్యం మత్తులో సెక్యూరిటీ గార్డుపై దాడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులోరెచ్చిపోయిన యువకుడు సెక్యూరిటీ గార్డుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. వెంకటగిరికి చెందిన అనిల్‌కుమార్ అన్నపూర్ణ స్టూడియోలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరే ఈనెల 11న విధులకు హాజరయ్యాడు. అర్ధరాత్రి సమయంలో ఇందిరానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ శ్రీకాంత్ స్టూడియో వద్దకు వచ్చాడు. మద్యం మత్తులో దుర్భాషలాడాడు. స్టూడియో గేటు మీద పెద్ద బండరాయి వేశాడు. శబ్దం రావడంతో అక్కడే కాపలాగా ఉన్న అనిల్‌కుమార్ గేటు తెరవగా శ్రీకాంత్ తనతో తెచ్చుకున్న కర్రతో దాడి చేశాడు. అనిల్‌కుమార్ తలకు తీవ్ర గాయం అవ్వడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. మిగతా సెక్యూరిటీ గార్డులు అనిల్‌ను ఆస్పత్రికి తరలించి శ్రీకాంత్‌ను పట్టుకొని జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. అతడిపై సెక్షన్ 326 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో మంగళసూత్రం చోరీ

మహిళ మెడలో ఉన్న మంగళసూత్రం స్నాచింగ్ అయింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 11లో నివాసముండే శ్రీవిద్య రమణ దంపతులు. వీరికి కూతురు ఉంది. ఈ నెల 11న కూతురును బస్టాప్‌లో దింపేందుకు దంపతులిద్దరూ ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. ఏఎన్‌ఆర్ సెంటర్‌కు చేరుకోగానే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు శ్రీవిద్య మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు మంగళసూత్రం లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా ఉగాది పద్య నాటకోత్సవాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ ఫిలించాంబర్ ఆవరణలోని రామానాయుడు కళామండపంలో పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది పద్య నాటకోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ నాటకోత్సవాలను తిలకిస్తున్న సినీ, టీవీ, కళాభిమానులు పరవశించిపోతున్నారు. పద్యనాటకోత్సవాల్లో భాగంగా శుక్రవారం సత్యహరిశ్చంద్ర నాటకాన్ని శ్రీనివాస చైతన్య కళానాట్య మండలి రంగస్థల నటులు ప్రదర్శించారు. ఆద్యంతం ప్రేక్షకుల ను కట్టిపడేసేలా వీరు నాటకాన్ని ప్రదర్శించారు. గయోపాఖ్యానం యుద్ధసీనులో శ్రీకృష్ణుడిగా కు మారి ధూపం తిరుమల తేజ, అర్జునుడిగా ధూపం రామకృష్ణ ప్రదర్శించారు. వారణాసి హరిగా బద్వేలు కిరణ్‌కుమార్, కాటిసీను హరిగా కుంచి దాసుబాబు, నక్షత్రగా ఏఎల్. ప్రసాదరాయ చౌదరి, చంద్రమతిగా అడపా ప్రభావతి, కాల కౌశికగా దర్శి శ్రీనివాసరావు, కేశవగా నారాయణరావు, లోహితగా బాల శుభశ్రీ నటించగా వీరికి హార్మోనిస్ట్‌గా ఉయ్యూరి నాగేశ్వర్‌రావు, మైక్ తుర్లపాడ శ్రీను, డోలక్ రామకృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా పలువురు సినీరచయితలు, సినీప్రముఖులు నాటకాన్ని వీక్షించి కళాకారులను అభినందించారు.



సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనలో కళాకారులు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసిన మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2.71 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. చందానాయక్ తండా ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో అక్రమంగా గ్యాంబ్లింగ్ సాగుతోందని మాదాపూర్ పోలీసులకు, ఎస్ఓటీకీ సమాచారం అందింది. వెంటనే దాడులు చేపట్టి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 2,71,500, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

యువకుడికి అరుదైన సర్జరీ

కూకట్‌పల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల యువకుడికి ఛాతీ కుడివైపున లోపలికి నొక్కుకుపోవడంతో వైద్యులు అరుదైన సర్జరీ చేసి సరిచేశారు. శ్వాస సమస్యను ఎదుర్కొంటున్న యువకుడు ఇటీవల కూకట్‌పల్లిలోని ఆమోర్ ఆస్పత్రిలో చేరాడు. యువకుడి సమస్యను వైద్య పరిభాషలో పెక్టస్ ఎక్స్‌కవాటమ్‌గా పేర్కొంటారని డాక్టర్ కిషోర్‌రెడ్డి తెలిపారు. ఛాతీతో పాటు ఊపిరితిత్తులు కూడా లోపలికి నొక్కుకుపోయి ఉండడం గమనించి శస్త్రచికిత్స చేశారు. లోపల అవసరమైన చోట్ల మెటల్ బార్లు, రిబ్ ప్లేట్స్ అమర్చి ఎద భాగాన్ని సాధారణ స్థితికి వచ్చేలా చేశారు. కార్డియాక్, వాస్క్యులర్ సర్జన్ కె.అరుణ్, ప్లాస్టిక్ సర్జన్ అభినందన్, ఇతర విభాగాల వైద్యులు జె.శ్రీనివాస్, జయశంకర్, ప్రత్యూష, మహేష్ బృందం ఆపరేషన్ నిర్వహించినట్లు డా.కిషోర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకోవడంతో పాటు శ్వాస సమస్య నుంచి బయటపడ్డాడని ఆయన వివరించారు.

కేపీహెచ్‌బీలో సెక్యూరిటీ గార్డు మృతి

హైదర్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలో సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. యూసఫ్‌గూడ జవహర్‌నగర్‌లో నివాసం ఉండే వనం శ్రీనివాస్(55) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. శ్రీనివాస్ మద్యానికి బానిసై ఇంటి నుంచి బయటకు వెళ్లి రెండు, మూడు నెలలు తర్వాత ఇంటికి వచ్చేవాడు. మద్యం తాగడం వల్ల పదేళ్లుగా అతడి ఆరోగ్యం బాగాలేదు. ఈ క్రమంలో జనవరిలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గురువారం రాత్రి కేపీహెచ్‌బీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించగా మృతుడి వద్ద లభించిన ఆధారాల ద్వారా శ్రీనివాస్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం మృతుడి కుమార్తె వనం స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

బాలానగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆదివారం నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని బాలానగర్ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆదిముళ్ల రావు, జనరల్ సెక్రటరీ గీటిమెట్ల రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ సామాజిక సేవలను వివరిస్తూ రాజూకాలనీ అంబేడ్కర్ భవన్‌లో కరపత్రాలను విడుదల చేశారు. సుంకే దీప్తి, సుంకే రామన్, రవి స్టీఫెన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీలో నచ్చిన సబ్జెక్టులను ఎంచుకునేలా ఉండాలి

పంజాగుట్ట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా తెలంగాణలో వివిధ సబ్జెక్టులలో డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులకు మూసపద్ధతిలో కాకుండా ఒక సబ్జెక్ట్ ప్రధానంగా, మరో రెండు సబ్జెక్టులు ఎంచుకునేలా అవకాశం కల్పించాలని తెలంగాణ మేధావుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.వీరస్వామి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక కార్యదర్శి చింతకింది కుమార స్వామి, కోశాధికారి అక్కినపల్లి వెంకటేశ్వర్లతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల విధానంలో మూడు విభాగాలు బీఎస్సీ, బీఏ, బీకాంలు ఉండగా నూత న విద్యావిధానంలో వీటిస్థానంలో ఒక సబ్జెక్ట్ ప్రధానంగా, ఏవైనా మరో రెండు సబ్జెక్టులు ఎంచుకొని చదువుకునేలా మార్పులు తేవాలన్నారు.విదేశాల్లో ఈ విద్యావిధానం ఉండగా, ప్రస్తు తం ఓ ప్రైవేట్ విశ్వవిద్యాలయం ఈ విధానాన్ని ప్రారంభించిందన్నారు. విద్యార్థి సైన్స్ సబ్జెక్టు మాత్రమే కాకుండా తనకు నచ్చిన వేరే సబ్జెక్టులను కూ డా చదువుకోవచ్చని, పరీక్ష పాస్ అయిన తరువాత బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పేరుతో సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. డిగ్రీలో చదివిన సబ్జెక్టుతో సంబం ధం లేకుండా పీజీలో ఏ సబ్జెక్టులోనైనా ఎంట్రెన్స్ రాసే అవకాశం కల్పించాలన్నారు. పదో తరగతి వరకు ఏవిధంగా కామన్ సబ్జెక్టులు ఉన్నాయో అదేవిధంగా పెట్టాలన్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయంలో వినతిపత్రం కూడా అందజేశామని తెలిపారు. సమావేశంలో వేదిక సభ్యులు బి.సుభాష్, యశ్వంత్, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ మేధావుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరస్వామి